ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 13 | సంచిక : 03 | నవంబర్ 2007

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

హైదరాబాద్ ......... 23-09-07

జిన్నూరు .............. 30-09-07

నరసాపురం ......... 21-10-07

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-09-2007, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వేదాలు, ఉపనిషత్‌లు, భగవద్గీత ఇవి అన్నీ మన ప్రాచీన గ్రంథాలు. మనం ప్రాచీన గ్రంథాలను మర్చిపోతున్నాము. వేదం అనేది ఒక మహావృక్షం. మనం చెట్లు ఎందుకు వేస్తాము? ఆ చెట్లు పెద్దవి అవ్వాలి, అందులో నుండి పుష్పాలు, పిందెలు రావాలి, అందులో నుండి పండ్లు రావాలి, ఆ పండును మనం అనుభవించాలి, దానికోసమే చెట్లు పెంచుతాము. వేదం అనే మహావృక్షానికి వచ్చే పండే అద్వైతం. అద్వైతం అనేది ఒక మతం కాదు. వేదమనే మహావృక్షానికి పండు కాస్తే, ఆ పండును మనం అనుభవిస్తాము, ఆ అనుభవమే అద్వైతం అని ఆచార్యులవారు చెప్పారు. మనందరకు భక్తి అవసరమే. జీవితంలో కష్టాలు, నష్టాలు, లాభాలు, ఆపదలు అన్నీ వస్తూ ఉంటాయి, మనం ఊహించ నటువంటి పరిణామాలు వస్తాయి. వీటి అన్నింటిని తట్టుకోవటానికి భక్తి అవసరం. మనం ధనాన్ని, విద్యను ఎలా సంపాదించుకొంటున్నామో అలాగ భక్తిని సంపాదించుకోవాలి. ఎందుచేతనంటే భక్తి అనేజల కనుక ఉంటే నదికి వరదవచ్చినప్పుడు దుంగలు ఎలా కొట్టుకొనిపోతాయో అలాగ మనకు వచ్చే కష్టాలు పైన ఉపరితలంలోనే అలా తేలి వెళ్ళిపోతాయి. భక్తి ఉన్నప్పుడు అవి మనలను పెద్దగా ఇబ్బంది పెట్టవు. ప్రతీ వాడికి భక్తి అవసరం, జ్ఞానం అవసరం, వివేకం అవసరం. శివసహస్రనామాలలో శివుడి గురించి కాలహరుడు, కామహరుడు అని చెపుతారు. కామాన్ని హరిస్తాడు, కాలాన్ని హరిస్తాడు. కాలం అంటే మృత్యువు. మనకు కోరికలో నుండే కోపం,

ద్వేషం, దుఃఖం అన్నీ వస్తాయి. అందరికి సుఖం, శాంతి కావాలి కాని ఎక్కడ సుఖం లేదో, ఎక్కడ శాంతి లేదో అక్కడ సుఖంకోసం, శాంతికోసం మనం వెతుకుతున్నాము. శాంతి, సుఖం ఎక్కడైతే ఉన్నాయో అక్కడ వెదుకుతూ ఉంటే ఈనాటికి కాకపోయినా ముందు నాటికైనా అవి లభిస్తాయి. అది లేనిచోట వెదుకుచూ ఉంటే కోట్లాది సంవత్సరాలు అలా వెదికినా అది దొరకదు. మనిషికి కావలసింది సుఖం, శాంతి. మనకు బాహ్య పరిస్థితులు అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేసి ఈ శరీరం మరణించేలోపు స్వతంత్రమైన ఆనందాన్ని, సుఖాన్ని మనం అనుభవంలోనికి తెచ్చుకొంటే ఇంక మనకు పునర్జన్మ లేదు. మనలో ఏదో వెలితి ఉన్నప్పుడు, ఏదో కొరత ఉన్నప్పుడు అది పొందాలి, ఇది పొందాలి అని అనుకొంటాము, ఇటువంటి డిజైర్ మనకు ఉన్నప్పుడు తప్పనిసరిగా పునర్జన్మ వస్తుంది. అది మంచి జన్మ అవ్వవచ్చు, చెడ్డ జన్మ అవ్వవచ్చు.

మాకు చదువు ఉంది, డబ్బు ఉంది, అధికారం ఉంది, మాకు అన్నీ ఉన్నాయి, దేనికి కొరత లేదు కాని శాంతి లేదు అంటారు. అంటే వాటిలో శాంతి లేదు అని మనకు తెలుస్తోంది కదా, భగవంతుడు ఎందుకు పెట్టాడో మన లోపల మనస్సు ఒకటి పడేసాడు. మనం నేను, నేను అంటాము కదా అదే మనస్సు. ఈ శరీరం నాది, ఈ ఆస్తి నాది అని శరీరం చెప్పదు, లోపల ఉన్న మనస్సు అంటుంది. ఈ చిన్న మనస్సులో నుండే ఇంత అశాంతి, ఇంత గందరగోళం వస్తోంది. ఆ మనస్సును బాగుచేసుకోవాలనే బుద్ధి మనకు రావటంలేదు, అది దురదృష్టం, వేదాలసారం, ఉపనిషత్తులసారం, మహర్షులు, యోగులు, ఆత్మజ్ఞానం పొందిన మహాత్ములు అందరూ కూడా ఏమి చెపుతున్నారు అంటే నీకు మనోనాశనం అయ్యేవరకు లోపల నున్న సుఖం నీకు స్వరూపంగా వ్యక్తం కాదు. సొమ్ము నీదే కాని నీ చేతికి అందటం లేదు. నీ హృదయంలో శాంతి ఉంది కాని అది నీ చేతికి అందటం లేదు. పెద్దలందరూ చెప్పేది ఏమిటి అంటే ఏ మనస్సుతో అయితే నీవు తాదాత్మ్యం పొందుతున్నావో, ఏ మనస్సును అయితే నేను అనుకొంటున్నావో అది నశించేవరకు లోపల ఉన్న సుఖం, శాంతి నీకు స్వరూపంగా వ్యక్తం కాదు. అది నీకు వ్యక్తమయ్యేవరకు నీకు స్వేచ్ఛలేదు, సుఖంలేదు, బంధం తప్పదు. జీవుడిని దుఃఖంలేని స్థితికి తీసుకొని వెళ్ళటం కోసం అనేక మంది మహాత్ములు అనేకరకాలుగా చెప్పారు. మనోనాశనం ఎలా చెయ్యాలి అని వాసుదేవ స్వామి గీతలో ఒక ప్రణాళికాబద్ధంగా చెప్పాడు. మనందరం భగవద్గీతను మర్చిపోయాము.

మనది వైదికమతం, ఎవరో ఒక వ్యక్తి స్థాపించినది కాదు, ఇది ఒక సనాతన ధర్మం. నువ్వు ఎలా జీవించాలి, నీ ప్రవర్తన ఎలా ఉండాలి అనేది వివరంగా పరమాత్మ చెప్పాడు. ధర్మ, అర్థ, కామ, మోక్షములు నాలుగు పురుషార్థములు. ఇందులో మొదట ధర్మం పెట్టాడు, చివర మోక్షం పెట్టాడు. అర్థకామములను మధ్యలో బిగించాడు. అర్థకామములు విచ్చలవిడిగా ఉండకూడదు. డబ్బు సంపాదించుకోవచ్చు అది ధర్మబద్ధంగా ఉండాలి. పూర్వం కంటే ఇప్పడు ఖర్చులు పెరిగి పోయాయి. చాలా విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. ఖర్చులు పెరిగే కొలది ధర్మవిరుద్ధంగా సంపాదించాలనే బుద్ధి కలుగుతుంది. ధర్మవిరుద్ధంకాని కోరిక, ధర్మవిరుద్ధంకాని సంపాదన కూడా నేను అని భగవంతుడు చెప్పాడు. అన్నింటికంటే ముఖ్యమైన పురుషార్థం మోక్షం. మోక్షం అంటే విడుదల. దేనిలో నుండి విడుదల? మనం ఏదైతే కాదో అది అవును అనుకొంటున్నాము, దానిలో నుండి విడుదల.

హిందూమతంలో పూజలకు ఎక్కువ ప్రాముఖ్యత పెరిగిపోయింది. పూజ, జపం, ధ్యానం అవసరమే, ఇవి అన్నీ ఎందుకు పెట్టారు అంటే మనస్సును నియమించుకోవటానికి పెట్టారు. అయితే హృదయంలో ఉన్న ఆనందాన్ని అందుకోవటానికి పూజ, జపం, ధ్యానం సరిపోవు. కర్మానుష్టానం ఉండాలి. మనం పిహెచ్‌డి చేయాలంటే గైడ్‌ను పెట్టుకొంటాము. ఇప్పడు పిహెచ్‌డి చేయడం తగ్గిపోయింది. ఎప్పడు చదువు పూర్తి చేసేద్దాము, ఎప్పడు డబ్బు సంపాదించేద్దాము అని చూస్తున్నారు. పిహెచ్‌డి 3 సంవత్సరాలు చేయటం వలన అదనంగా వచ్చేది ఏముంది అనుకొంటున్నారు. స్టూడెంట్స్ మనస్తత్వం, తల్లి తండ్రుల మనస్తత్వం కూడా అలాగే ఉంది, చదువు అనేది కేవలం పొట్టకోసమే అనే భావన ఉంది కాని మనో వికాశానికి చదువు ఉపయోగపడుతుంది అనే భావన తగ్గిపోయింది. వివేకానంద ఒకమాట చెప్పాడు. నేను చాలా దేశాలు చూసాను. చదువులేనివారికంటే చదువు ఉన్న వారిలోనే ఎక్కువ స్వార్థపరులు ఉన్నారు అని స్వామీజీ చెప్పారు. వాడు ఎంత పండితుడు అయినా, వాడికి ఎంత ధనం ఉన్నా, స్వార్థం ఉన్నవాడు పవిత్రుడు కాలేడు. ఒక మనిషిని కొలిచేటప్పడు వాడి ఆస్తి, కీర్తి, అధికారం ఇవి ఏమీ చూడకండి. ఇవి అన్నీ బాహ్యమైన విషయాలు. అంతరంగా ఎలా ఉన్నాడు, పది మంది క్షేమం కోరుతున్నాడా, సమాజానికి ఏమైనా సహాయం చేస్తున్నాడా, సమాజాన్ని ప్రేమిస్తున్నాడా అనేది చూడండి అని చెప్పాడు. ప్రతీ జ్ఞాని కూడా సముద్రంలాంటివాడు. నదులు మహాప్రవాహంగా వెళ్లి సముద్రంలో కలిసినా సముద్రానికి వచ్చే లాభంలేదు, నదులు కలవకపోయినా సముద్రానికి వచ్చే నష్టం లేదు. అలాగే మహాజ్ఞాని దగ్గరకు భక్తులు వెళ్లి

కూర్చోవటం వలన వాడికి ఏమీ లాభం లేదు, వెళ్లకపోవటం వలన వచ్చే నష్టం లేదు. వాడు ఎప్పుడూ నిండుగానే ఉంటాడు, వాడికి అసలు బాహ్యప్రవృత్తే ఉండదు. అయితే మహాత్ములు పని చేస్తున్నారు, రమణుడు రామకృష్ణుడు పని చేసారు, ఎందుకు చేస్తున్నారు, ఏదైనా అవసరముండి చేస్తున్నారా అంటే ఏమీలేదు. జ్ఞాని దయాస్వరూపుడు, ప్రేమ స్వరూపుడు. మహాత్ములు బయట ఏదో పని చేస్తున్నా లోపల వారి శాంతికి భంగం ఏమీలేదు.

లోపల ఏదో బ్రహ్మపదార్థం ఉంది అంటున్నారు, ఉంటే మాకు తెలియాలి కదా అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమి చెప్పారు అంటే నీ రాంగ్‌తింకింగ్‌లోనుండి, నీ రాంగ్‌హేబిట్స్‌లోనుండి నువ్వు బయటకురా. ఇప్పడే ఇక్కడే ఆ వస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది, అది ప్రత్యక్షానుభవం. ప్రతీ మనిషికి వాడి యోగక్షేమాల గొడవ తప్పించి, మనలను మనం మర్చిపోయి ఎప్పడైనా ఎవరినైనా ప్రేమించామా? నిన్ను నీవు ఎలా ప్రేమించుకొంటున్నావో అలాగ కనిపిస్తున్నటువంటి ఈ సృష్టిని ప్రేమించగలగాలి. సృష్టి అంటే ఈశ్వరుడి యొక్క స్థూలరూపమే. మన హృదయంలో సత్యం ఉంది. అది ఎలా ఉండాలో అలాగ ఉంది గాని నువ్వు అనుకొన్నట్లు లేదు. అది ఎలాగ ఉందో అలాగ నీకు రివీల్ అవ్వాలంటే అది ఎంత ఇంపెర్సనల్‌గా ఉందో, అది ఎంత సింపుల్‌గా ఉందో, అది ఏ స్థాయిలో ఉందో ఆ స్థాయికి మనం ఎదిగి వచ్చినప్పడు ఒక్క క్షణం కూడా లేటు చేయకుండా అది మనకు రివీల్ అవుతుంది. ఏ వస్తువునైతే మనం తెలుసుకోవాలనుకొంటున్నామో దాని తాలుక దయ లేకుండా అది మనకు తెలియబడదు. అది నీకు ఎరుకలోనికి రావాలంటే నీకు మెచ్యూరిటీ రావాలి. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు, ఇందులో సందేహం లేదు, ఇది నిశ్చయం అని భగవంతుడు చెప్పాడు.

ప్రతీమనిషికి లోకవాసన ఉన్నంతకాలం మత్తు వస్తుంది. మంచిని చెడ్డ అనుకొంటాడు, చెడ్డను మంచి అనుకొంటాడు, నిత్యాన్ని అనిత్యం అనుకొంటాడు, అనిత్యాన్ని నిత్యం అనుకొంటాడు. మంచి చేసేవారు కూడా లోకంలో గౌరవం వస్తుంది అంటేనే చేస్తారు, వీటి అన్నింటికి కారణం లోకవాసన. ఈ లోకవాసనను మనం పోగొట్టుకోలేము. లోకంలో మంచిపనులు చేసేవారు కూడా ఈశ్వరుడి ప్రీత్యర్థం చేయరు, మంచి మంచికోసం చేయరు, ఫలితం కోసం చూస్తారు. ఇటువంటి మీకు జ్ఞానం ఇవ్వటానికి భగవంతుడు అమాయకుడా. అందరూ క్షేమంగా ఉండాలి, శాంతిగా ఉండాలి అని మనం ఏ పని

చేయము, ఇటువంటి నీకు దైవ సాక్షాత్కారమా? బజారులో చీరకొనాలంటే 100 రూపాయలు చెపితే మనం 90 రూపాయలు ఇచ్చినా ఆ చీర ఇవ్వడు, దాని మూల్యం ఎంతో మనం ఇవ్వాలి. అలాగే భగవదనుభవం పొందాలంటే దానికి చెల్లించవలసిన మూల్యం చెల్లించవలసిందే. ఆ మూల్యం ఏమిటి అంటే నేను, నాది అనే తలంపులు. బాహ్యంగా నీవు ఎంతటి వాడివైనా ఈ రెండు తలంపులలో నుండి విడుదల పొందకపోతే నీకు శాంతిలేదు, సుఖం లేదు. పదిమంది క్షేమం కోరే బుద్ధి నీకు లేనప్పుడు దైవసాక్షాత్కారం అడగటంలో అర్థం ఏమిటి? శక్తి భగవంతుడికి ఉంది కాని జీవుడికి శక్తి లేదు. అహంకారం తగ్గకుండా, మమకారం తగ్గకుండా ఎన్నడూ మీకు శాంతి రాదు అని గీతలో పరమాత్మ చెప్పాడు. ఎప్పడైనా మన మనస్సు అణిగినప్పడు రమణమహర్షికంటే, రామకృష్ణుడికంటే మనమే ఎక్కువ అనిపిస్తుంది. పరిస్థితులు అన్నీ బాగున్నాయి అనుకోండి, మనస్సు అణిగి ఉంది అనుకోండి, ఏదో పది రోజులు శాంతిగా ఉంటాము. అణిగిన మనస్సును ఎవరూ నమ్మకూడదు, అది ఎప్పడైనా విజృంభించే అవకాశం ఉంది, మనస్సు నశించాలి.

నాకు ఆ పని ఉంది, నాకు ఈ పని ఉంది బిజీగా ఉన్నాను, భగవద్గీత చదవటానికి నాకు టైములేదు, పూజ చేసుకోవటానికి నాకు టైము లేదు అంటాము. నిన్ను నీవు బాగుచేసుకోవటం కంటే మించిన పని ఉందా, అది నీకు పని కాదా అని గీతలో పరమాత్మ చెప్పాడు. నీ మనస్సును బాగుచేసుకోవటం, నీ మనస్సును నియమించుకోవటం కంటే మించిన పని అంటూ ఏదైనా ఉందా. నిన్ను నీవు ఉద్ధరించుకోకుండా, ఎవరో వచ్చి ఉద్ధరిస్తారు అని కనిపెట్టుకొని ఉండవద్దు. నిన్ను నీవు ఉద్ధరించుకోవటానికి ప్రయత్నం చెయ్యి, కాలం కలిసివస్తుంది, ఈశ్వరుని దయ నీకు కలుగుతుంది, అప్పడు తరిస్తావు. మనం ఏదైనా మాట్లాడుతూ ఉంటే కపటంతో మాట్లాడుతున్నామా, కపటం లేకుండా మాట్లాడుతున్నామా, లోపల ఏదైనా ద్వేషం పెట్టుకొని మాట్లాడుతున్నామా, ఏదైనా కోరిక పెట్టుకొని మాట్లాడుతున్నామా, కోరిక లేకుండా మాట్లాడుతున్నామా అనేది ప్రతీదీ భగవంతుడు చూస్తూ ఉంటాడు, ఆయన సర్వసాక్షి. మనకు ఏదైనా చెడు తలంపు వచ్చినా, మంచి తలంపు వచ్చినా ఇది ఎవరికి తెలియదు అని మనం అనుకొంటాము కాని భగవంతుడు మన హృదయంలో ఉండి ప్రతీదీ రికార్డు చేస్తాడు. మనం దేవాలయానికి వెళ్ళినప్పడు మంచి బుద్ధిని ప్రసాదించు, మంచి మనస్సును ప్రసాదించు, పదిమందికి సహాయపడే నేచర్‌ను ప్రసాదించు అని భగవంతుడిని కోరుతున్నామా? లేదు. లోపల స్వార్థం పెట్టుకొని భగవంతుడిని ఏదో అడుగుతూ ఉంటాము.

మనం కాలాన్ని వృధా చేసుకోకుండా, ఎప్పడూ భగవంతుడిని అంటిపెట్టుకొని ఉండాలి. చెట్టును అంటిపెట్టుకొని ఉంటే కాయ ముగ్గుతుంది. అలాగే మనం భగవంతుని పాదాలను అంటిపెట్టుకొని ఉంటే మనకు మెచ్యూరిటీ వస్తుంది గాని లేకపోతే రాదు. అర్జునుడు భగవంతుడు చెప్పిన మాటలు విన్నాడు. కృష్ణా నువ్వు చెప్పిన మాటలు ఎందుకు వింటున్నానో చెప్పమంటావా నాకు మోహం ఉంటే, నాలో అజ్ఞానం ఉంటే నువ్వు భగవంతుడివి అయినా నువ్వు చెప్పిన మాటలు నేను వినను. నీ విశ్వరూపం చూపించావు, నాలో మోహం తగ్గింది, దేహాభిమానం తగ్గింది కాబట్టి నువ్వు చెప్పిన మాటలు శ్రవణం చేస్తున్నాను, అంతేకాదు నువ్వు చెప్పింది ఆచరిస్తాను అని అర్జునుడు పరమాత్మకు చెప్పాడు. మన ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవటానికి, మనలను మనం సంస్కరించుకోవటానికి చేసే ప్రయత్నమే సాధన. ప్రతీ మనిషికి వాడిలోని బలహీనతలు వాడికి తెలుస్తూ ఉంటాయి, ఆ బలహీనతలను, చెడు వాసనలను తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. వాటిని భగవంతుడు మనకు ఇవ్వలేదు. ఒక టైములో అవి మంచివి అనుకొని వాటిని మనం ప్రాక్టీసు చేసాము. ఆ ప్రాక్టీసు చేసినవే మనకు వచ్చాయి. ఇదంతా దేవుడు చేసాడు, దేవుడు చేసాడు అంటాము. దేవుడికి పక్షపాతం లేదు. మనం చేసినదే మనకు ఇస్తాడు.

లోకంలో ఏదో ఉంది, లోకంలో ఏదో ఉంది అని లోకంలో తిరుగుతూ లోకవాసన పెంచుకొంటున్నాము. జ్ఞానం అనేది బయట నుండి వచ్చేదికాదు, అది లోపల నుండే రావాలి. కోపం వస్తూ ఉంటే నష్టం ఏమిటి, కోరిక వస్తూ ఉంటే నష్టం ఏమిటి, భయం వస్తూ ఉంటే నష్టం ఏమిటి అని అడుగుతున్నారు. భయం కూడా దుఃఖం ఉంటుంది, కోరిక కూడా దుఃఖం ఉంటుంది, కోపం కూడా దుఃఖం ఉంటుంది. ఇవి మూడూ ఉన్నంతసేపు ఎవడూ దుఃఖరహిత స్థితిని పొందలేడు. అందుచేత ఏదో మామూలుగా ప్రయత్నం చేయటంకాదు, శక్తివంచన లేకుండా ప్రయత్నం చేసి, సర్వవిధములుగా ప్రయత్నం చేసి, భక్తిమార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం ఇలా నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణం చేసి లేకపోతే అన్ని మార్గములను సమన్వయం చేసుకొని ప్రయత్నం చేసి ఈ మూడింటిలో నుండి విడుదలపొందు. శరీరం కూడా నీడ ఎలా వెంటాడుతుందో అలాగ ఈ మూడు ఉన్నంతసేపు నిన్ను దుఃఖం, అశాంతి వెంటాడతాయి. అందుచేత అన్నివిధములుగా ప్రయత్నం చేసి, భగవంతుని పాదాలను ఆశ్రయించి, ఈ మూడింటిలో నుండి విడుదల పొందితే భగవంతుడిలో ఐక్యమవుతావు, అదే మన జీవిత గమ్యం.